వామ్మో... వానొస్తుందేమో..!

- కోత దశకు వచ్చిన వరి పైరు
- వారంలో ప్రారంభం కానున్న కోతలు
- తుఫాన్ ఎఫెక్ట్‌పై రైతుల ఆందోళన
- పెదకూరపాడు, సత్తెనపల్లి నియోజకవర్గాల్లో కలవరం
- 12,707 హెక్టార్లలో వరి పంట సాగు


నాలుగు రోజుల క్రితం ఈదురు గాలులకు నాగిరెడ్డిపాలెంలో నేలవాలిన వరి పైరు


మరో వారం రోజుల్లో కోతకు సిద్ధమైన పంట

బెల్లంకొండ: ఖరీఫ్‌లో సాగు చేసిన వరి పంట కోత దశకు వచ్చింది. మరో వారం పది రోజుల్లో కోతలు ప్రారంభించేందుకు పెదకూరపాడు, సత్తెనపల్లి నియోజకవర్గాల రైతులు సమాయత్తమవుతున్నారు. వారం క్రితం రెండు రోజులపాటు మోస్తరుగా వర్షం కురిసింది. కాగా రెండు మూడు రోజులుగా మళ్లీ వాతావరణంలో మార్పులు కనిపిస్తున్నాయి. ఎండ లేకుండా వాతావరణం చల్లబడింది. మేఘాలు కమ్ముకొస్తూ రైతులను భయపెడుతున్నాయి. తీరా పంట కోత మొదలు పెట్టిన తర్వాత వర్షం వస్తే నిండా మునిగిపోతామని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. వరి ధాన్యం నల్లబడిపోతుందని, పూర్తిగా నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన చెందుతున్నారు.

రెండు నియోజకవర్గాల వ్యాప్తంగా...

పెదకూరపాడు, సత్తెనపల్లి నియోజకవర్గాల వ్యాప్తంగా 12,707 హెక్టార్లలో ఈ ఏడాది ఖరీఫ్‌లో వరి సాగు చేపట్టారు రైతులు. సోనా, సౌభాగ్య సోనా, ఇతర సన్న, సోనా రకాలతో పాటు బీపీటీ రకాలను సాగు చేశారు. బెల్లంకొండ, రాజుపాలెం, క్రోసూరు, ముప్పాళ్ల, నెకరికల్లు, సత్తెనపల్లి మండలాల్లో అధిక శాతం రైతులు కాల్వ ఆయకట్టునే వరి సాగు చేశారు. మిగిలిన మండలాల్లో ఎక్కువ భాగం బోరు బావుల ఆధారంగా పంట పండిస్తున్నారు. ఎకరాకు సుమారుగా రూ.40 వేలకు పైగా పెట్టుబడి అయ్యింది.

మండలాల వారీగా వరి సాగు వివరాలు (హెక్టార్లలో)

మండలం	సాధారణ విస్తీర్ణం	సాగు విస్తీర్ణం
బెల్లంకొండ	723	869
క్రోసూరు	1,408	961
అచ్చంపేట	523	349
పెదకూరపాడు	105	75
అమరావతి	273	238
సత్తెనపల్లి	1,379	700
ముప్పాళ్ల	1,534	1,511
రాజుపాలెం	2,069	2,345
నెకరికల్లు	5,784	5,659
మొత్తం	13,798	12,707

కోత దశలో దెబ్బ తీస్తుందేమోనని..

వరి పంట కోత దశకు వచ్చింది. మరో వారంలో కోతలు ప్రారంభిస్తాం. వారం క్రితం వర్షం కురవడంతో వరి పైరు అక్కడక్కడా నేలవాలింది. నేలకు ఒరిగిన దుబ్బలను పైకి లేపి.. మూడు, నాలుగు దుబ్బు కలిపి కట్టాం. ప్రస్తుత పరిస్థితిల్లో ఏ మాత్రం తుఫాన్ ప్రభావం పడ్డా పంటను నష్టపోతాం. ఈదురు గాలులు వీచినా పంటంతా నేలవాలుతుంది.

– బద్దూరి శేషిరెడ్డి, రైతు, నాగిరెడ్డిపాలెం, బెల్లంకొండ

దిగుబడిపై ఆశలు

ఖరీఫ్ వరి సాగు ఈ ఏడాది ఆశాజనకంగా ఉంది. నాట్లు తర్వాత వర్షాలు కురవడం, తెగుళ్ల ప్రభావం పెద్దగా లేకపోవడంతో నాణ్యమైన పంట కనిపిస్తోంది. ఇంత వరకు పెట్టుబడి సాయం ప్రభుత్వం అందించనప్పటికీ రైతులు అప్పుచేసి మరీ వరి పంట సాగు చేపట్టారు.

బాలల హక్కులపై విద్యార్థులకు అవగాహన


విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న బత్తుల పద్మావతి

సత్తెనపల్లి: పిల్లల రక్షణ సంరక్షణకు బాలల హక్కులు ప్రవేశపెట్టినట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి అన్నారు. రామకృష్ణాపురంలోని బాలికల గురుకులంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం బాలల హక్కుల వారోత్సవాల సందర్భంగా ఆటల పోటీలు నిర్వహించి, బహుమతుల ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా పద్మావతి పాల్గొన్నారు. సత్తెనపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ శ్రీలత అధ్యక్షత వహించారు. బత్తుల పద్మావతి మాట్లాడుతూ ఐక్యరాజ్య సమితి 1989 నవంబర్ 20న అంతర్జాతీయ బాలల హక్కుల ఒడంబడికను ఆమోదించడం జరిగిందన్నారు. వాటిల్లో జీవించే హక్కు, అభివృద్ధి చెందే హక్కు, రక్షణ పొందే హక్కు, భాగస్వామ్యపు హక్కు ఉన్నాయన్నారు. ఆ హక్కుల గురించి వివరించారు. బాల్యవివాహాలు, బాల కార్మికులు లేని జిల్లాగా, స్నేహపూరిత జిల్లాగా నిర్మించుకుందామని బాలలతో ప్రతిజ్ఞ చేయించారు. ఆటల పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. గురుకులం ప్రిన్సిపల్ శైలజ, హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థ ఉపాధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు, బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ కె.శ్రీనివాసరావు, ఐసీడీఎస్ సూపర్వైజర్స్ ఆశ, అనంత లక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు ఉన్నారు.

పంటల బీమా చేయించుకోవాలి


రైతులకు సూచనలిస్తున్న ఏఓ దేవదాసు


లింగంగుంట్ల గ్రామంలో పత్తి పంట క్షేత్ర సందర్శన

నార్నెపాడు(ముప్పాళ్ళ)/అమరావతి/నకరికల్లు/పెదకూరపాడు: సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల మండలాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించారు. వ్యవసాయశాఖ అధికారులు పంట పొలాలను సందర్శించారు. రైతులకు పంటల బీమా, సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. పత్తికి మద్దతు ధర పొందేందుకు సలహాలు అందించారు.

- ముప్పాళ్ల ఏఓ ఎం.అరుణ లంకెలకూరపాడు, నార్నెపాడు గ్రామాల్లో పంటలను పరిశీలించారు. రబీ పంటల బీమాను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. రైతు సేవ కేంద్రంలోని పత్తి రైతులు పేర్లు రిజిస్టర్ చేసుకుని, సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకోవాలని తెలిపారు. మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణ చర్యలు తెలిపారు. వీఏఏలు కె.ఎల్.ప్రియాంక, పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.
- అమరావతి వ్యవసాయశాఖాధికారి అహ్మద్ లింగాపురం, ధరణికోట గ్రామాల్లో పర్యటించారు. పత్తి విక్రయానికి రైతులు ముందుగా రైతు సేవా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. తేమ శాతం 8 నుంచి 12 శాతం మాత్రమే ఉండాలని చెప్పారు.
- నకరికల్లు వ్యవసాయాధికారి కె.దేవదాసు కుంకలగుంట, జిల్లాపేట తండాలో పర్యటించారు. వరి పైరులో గొంగళిపురుగు, ఆకుముడత నివారణ చర్యలను రైతులకు వివరించారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా ఎకరా వరి పంటకు రూ.42 వేలుగా నిర్ణయించినట్లు తెలిపారు. ఎకరాకు రూ.630 ప్రీమియం చెల్లించి, డిసెంబర్ 31లోగా క్రాప్ ఇన్సూరెన్స్‌కు నమోదు చేసుకోవాలని సూచించారు. ఉప సర్పంచ్ ఎస్.అంకారావు, వీఏఏ షేక్. అడవి నవాజ్‌షరీఫ్, పి.సాయివెంకట్ పాల్గొన్నారు.
- పెదకూరపాడులోని లింగంగుంట్ల లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతు ఏనుబర్ల విజయబాబు పత్తి వ్యవసాయ క్షేత్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పంట కోత ప్రయోగం నిర్వహించారు. జిల్లా అధికారి సీఎం రెడ్డి పాల్గొని, మాట్లాడారు. అంతర పంటలతో పత్తిలో తెల్ల దోమ, పచ్చ దోమ తదితర తెగుళ్ల ఉధ్రుతి తగ్గుతుందని వివరించారు. జిల్లా సిబ్బంది నందుకుమార్, భార్గవ్, మాస్టర్ ట్రైనర్ మధుబాబు, యూనిట్ ఇన్‌చార్జ్ అమూల్య, వెంకటేశ్వర్లు, మాణిక్యరావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా గ్రంథాలయ వారోత్సవాలు


ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళి

సత్తెనపల్లి/అమరావతి/క్రోసూరు/పెదకూరపాడు : గ్రంథాలయ వారోత్సవాలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. మంగళవారం పలు గ్రంథాలయాల్లో విద్యార్థులకు దేశభక్తి గీతాలు, ముగ్గుల పోటీలు నిర్వహించారు. సత్తెనపల్లి పట్టణంలోని గ్రంథాలయంలో విద్యార్థినులకు రంగవల్లులు, దేశభక్తి గీతాల పోటీలు నిర్వహించారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ, ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళు లర్పించారు.

- అమరావతి గ్రంథాలయంలో విద్యార్థులకు ఆటల పోటీలు, మాదక ద్రవ్యాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు గ్రంథాలయ ఇన్‌చార్జి ఎం వెంకయమ్మ మాదక ద్రవ్యాల దుష్పరిణామాలు విద్యార్థులకు వివరించారు. మ్యూజిక్ చైర్స్, ముగ్గుల పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తల్లం తనూజ, రాజా నాగేశ్వరరావు పాల్గొన్నారు.
- క్రోసూరు గ్రంథాలయంలో విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. జూనియర్స్ ప్లాస్టిక్ నియంత్రణ – పౌరుల పాత్ర, సీనియర్స్ లైగింక వేధింపులు, అత్యాచారాలు – సమాజంలో రావాల్సిన మార్పు అనే అంశాలపై వ్యాసరచన పోటీల్లో పాల్గొన్నారు. జూనియర్స్‌కు జల సంరక్షణ, సీనియర్స్‌కు జాతీయ నాయకుల ముఖ చిత్రాలపై చిత్ర లేఖనం నిర్వహించారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ చిత్రపటానికి ఘన నివాళులర్పించారు. గ్రంథాలయ అధికారి వై.వీ రాంజమ్మ పర్యవేక్షించారు. శిలార్‌షా, షణ్ముఖరెడ్డి, రాజుమాస్టారు పాల్గొన్నారు.
- పెదకూరపాడులోని డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి గ్రంథాలయంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. గ్రంథాలయశాఖ అధికారి వాణి, మహిళా కానిస్టేబుల్ విమల ఉన్నారు.

డిసెంబరు ఆఖరుకి పనులు పూర్తి చేయాలి

డ్వామా పీడీ శివలింగమూర్తి


మాట్లాడుతున్న డ్వామా పీడీ

రాజుపాలెం: పల్లె పండగ కార్యక్రమంలో శంకుస్థాపనలు చేసిన పనులను డిసెంబర్ 31వ తేదీ లోపు పూర్తి చేయాలని డ్వామా పీడీ మట్టా శివలింగమూర్తి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయిలో ముప్పాళ్ల, రాజుపాలెం, నకరికల్లు, సత్తెనపల్లి మండలాలకు చెందిన ఏపీవోలు, ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు, బీఎఫ్‌టీలు, జేఈ, ఈసీలకు ఉపాధి పనులపై సమీక్ష సమావేశం మంగళవారం నిర్వహించారు. సమీక్షలో పీడీ మాట్లాడుతూ సీసీ రోడ్లు, డ్రైయిన్స్, పశువుల షెడ్‌లు, హార్టికల్చర్, పాడి పరిశ్రమాభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఎంపీడీవో జీవీ సత్యనారాయణ, ఏపీడీ పొత్తూరి వెంకటనారాయణ పాల్గొన్నారు.

ఇందిరా గాంధీ సేవలు మరువలేనివి



సత్తెనపల్లి: దేశ మాజీ ప్రధాని ఇందిరా గాంధీ సేవలు మరువలేనివని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త చుక్కా చంద్రపాల్ అన్నారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు దాసరి జ్ఞానరాజ్ పాల్ ఆధ్వర్యంలో ఇందిరా గాంధీ 107వ జయంతి వేడుకలు మంగళవారం నిర్వహించారు. చంద్రపాల్ మాట్లాడుతూ ఇందిరా గాంధీ దేశ వ్యాప్తంగా ఇల్లు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు, పక్కా ఇళ్లు నిర్మించి, భూమి లేని నిరుపేదలకు భూములు పంచి, నిరుపేదల గుండెల్లో చిరస్థాయిగా ఇందిరమ్మగా నిలిచి పోయారన్నారు. పట్టణంలోని గాంధీ బొమ్మల సెంటరు, నాగన్నకుంట సెంటర్, వడ్డవల్లి, కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఇందిరా గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్త లక్ష్మయ్య, నాయకులు చాస్ బాషా, సిద్దెల మోహన్‌రావు, ఎం.శంకర్, జెట్టి శేఖర్, కోటపాడి సాంబశివరావు, కోట ఆనంద్ పాల్గొన్నారు.

ఆదాయ వనరుల డేటా నమోదులో వెనుకంజ



అచ్చంపేట: ప్రత్యేక ప్రభుత్వ యాప్‌లో వివరాలు నమోదు చేయడంలో గ్రామ సమైఖ్యలు చాలా వెనుకబడ్డాయని డీఆర్‌డీఏ పీడీ బాలూ నాయక్ అసంతృప్తి వ్యక్తం చేశారు. స్థానిక వెలుగు కార్యాలయాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. గ్రామ సమైఖ్య సహాయకులు, కమ్యూనిటీ కో–ఆర్డినేటర్స్, ఏపీఎం, వెలుగు సిబ్బందితో మాట్లాడారు. మండలంలో ఉన్న ప్రతి గ్రూపు సభ్యుల వివరాలు యాప్‌లో నమోదు చేయాలన్నారు. వారి జీవనోపాధికి, ఆర్థిక వనరులను పెంపొందించేందుకు చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. మండలంలో 1,100లకు పైగా గ్రూపులున్నాయని తెలిపారు. నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. కమ్యూనిటీ కో–ఆర్డినేటర్స్, అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజరుకు పలు సూచనలు చేశారు.

విద్యార్థినుల ప్రాణాలతో చెలగాటమొద్దు

గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చిట్టా విజయభాస్కరరెడ్డి


వసతి గృహంలో ఆహారాన్ని పరిశీలిస్తున్న చిట్టా విజయభాస్కరరెడ్డి, నాయకులు

సత్తెనపల్లి: విద్యార్థినుల ప్రాణాలతో చెలగాటం ఆడొద్దని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ నాయకుడు చిట్టా విజయ భాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. సత్తెనపలి వెంకటపతి నగర్‌లోని ఎస్సీ బాలికల కళాశాల వసతి గృహాన్ని మంగళవారం వైఎస్సార్ సీపీ బృందం సందర్శించింది. వంటగది, మరుగుదొడ్లు, పరిసరాలను పరిశీలించారు. విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ వంట గది అత్యంత దారుణంగా ఉందన్నారు. పది నిమిషాలు కూడా అక్కడ నిలిచే పరిస్థితి లేదన్నారు. మరుగుదొడ్లకు తలుపులు లేవని, శుభ్రత మచ్చుకైనా కనిపించడం లేదన్నారు. భోజనం రెండు రోజుల క్రితందిలా ఉందన్నారు. మెనూ ఏమాత్రం పాటించడం లేదని చెప్పారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఈ హాస్టల్ పై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, మెరుగైన విద్య, నాణ్యమైన ఆహారం అందించాలని సూచించారు. కలెక్టర్ స్పందించి వసతి గృహంలో విద్యార్థినుల ఆత్మహత్యయత్నానికి గల కారణాలపై విచార చేపట్టి, బాధ్యులైన వర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పెండెం బాబురావు, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు షేక్ నాగుర్ మీరాన్, రమావత్ కోటేశ్వరరావు నాయక్, కౌన్సిలర్లు గుజ్జర్లపూడి సతీష్, నాయకులు లోకా మాధవ, వల్లెం నరసింహారావు, తుమ్మల వెంకటేశ్వరరావు, ఉల్లంఘుల ప్రసాద్ బాబు పాల్గొన్నారు.

ప్రజల తరపున నిత్యం పోరాడుతున్న సీపీఎం


మహా సభలో మాట్లాడుతున్న గుంటూరు విజయ్‌కుమార్

సత్తెనపల్లి: ప్రజల తరపున సీపీఎం నిత్యం పోరాడుతుందని పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వై.రాధాకృష్ణ పేర్కొన్నారు. సీపీఎం సత్తెనపల్లి మండల 7వ మహా సభ కందులవారిపాలెం గ్రామంలో కామ్రేడ్ బగ్గి వెంకటేశ్వర్లు ప్రాంగణంలో మంగళవారం నిర్వహించారు. పార్టీ జెండాను పార్టీ సీనియర్ సభ్యుడు షేక్ హుస్సేన్ సా ఆవిష్కరించారు. ప్రారంభ ఉపన్యాసం రాధాకృష్ణ ఇచ్చారు.

బీజేపీ రాజ్యాంగ వ్యవస్థను ధ్వంసం చేస్తూ దేశంపై నియంతృత్వాన్ని రుద్దాలని ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. గడిచిన పదేళ్లలో ఎన్‌డీఏ కూటమి రూ.100 లక్షల కోట్లకు పైగా అప్పులు చేసిందన్నారు. ఫెడరలిజాన్ని దెబ్బతీసి ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వ హక్కులను హరించే ప్రయత్నాలు చేస్తోందన్నారు. ఎన్‌డీఏ ప్రజా వ్యతిరేక విధానాలను సీపీఎం తరపున వ్యతిరేకిస్తామని, రాష్ట్రంలో తెలుగుదేశం, జనసేన బీజేపీకి తొత్తులుగా మారాయన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల వాగ్దానాలను అమలు చేయడం లేదన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ కాకుండా కేంద్రంపై పోరాడాలన్నారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు అనుమల లక్ష్మీశ్వర రెడ్డి, కమిటీ సభ్యులు బాలకృష్ణ, విమల, పార్టీ నాయకులు రజిని మాట్లాడారు. కార్యదర్శి పెండ్యాల మహేష్ మండల నివేదికను ప్రవేశ పెట్టారు. మండల కమిటీని ఎన్నుకున్నారు. నరసింహారావు, రామారావు, భగత్, మేరమ్మ, లక్ష్మీనారాయణ, పూర్ణచంద్రరావు, తులసి పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

డీఈఓ ఎల్.చంద్రకళ


విద్యార్థినుల అభ్యాసన సామర్థ్యం పరిశీలిస్తున్న డీఈఓ ఎల్.చంద్రకళ

ముప్పాళ్ళ: తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై దృష్టి పెట్టి, వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ చెప్పారు. మండలంలోని ముప్పాళ్ళ, మాదల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను, ఉపాధ్యాయులకు జరుగుతున్న కాంప్లెక్స్ సమావేశాలను మంగళవారం ఆమె పరిశీలించారు. మెరుగైన చేతి రాతకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. సిమ్స్ యాప్‌లో విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును పరిశీలించారు. విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలు గమనించి, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులకు కిట్‌ల రశీదు, పంపిణీ రికార్డులను తనిఖీ చేశారు. ఎక్కువ రోజులు గైర్హాజరవుతున్న విద్యార్థులతో తల్లిదండ్రులతో మాట్లాడాలని సూచించారు. పాఠశాలలో ఆపార్ అప్‌డేషన్‌కు సంబంధించి ఏర్పాటు చేసిన ఆధార్ క్యాంపును పరిశీంచారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. మాదల జెడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు స్కూల్ క్లాంపెక్స్ సమావేశాన్ని, ముప్పాళ్ళ జెడ్పీ పాఠశాలలో ప్రాథమిక పాఠశాలల కాంప్లెక్స్ సమావేశాన్ని తనిఖీ చేశారు. సమావేశాల్లో గమనించిన అంశాలను పాఠశాలల్లో అమలు చేసి విద్యార్థులకు అర్థమయ్యేలా బోధన చేపట్టాలన్నారు. జెడ్పీ పాఠశాలల ప్రదానోపాధ్యాయులు కె.నాగేంద్రమ్మ, రమేష్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తపై దాడి హేయం

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రవిబాబు


తహసీల్దారు కార్యాలయం వద్ద కార్యకర్తల ధర్నా

బెల్లంకొండ: అంగన్‌వాడీ కార్యకర్తపై, ఆమె కుటుంబ సభ్యులపై తెలుగుదేశం పార్టీ నాయకులు దాడి చేయడం హేయమని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జి.రవిబాబు అన్నారు. మన్నె సుల్తాన్‌పాలెం అంగన్‌వాడీ కార్యకర్త మాటూరి బుజ్జిపై టీడీపీ నాయకులు దాడికి దిగడంతో మంగళవారం స్థానిక మండల రెవెన్యూ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు ధర్నా చేపట్టారు. బుజ్జి ఉద్యోగానికి రాజీనామా చేయాలని అసభ్యకరంగా బూతులు తిట్టి, ఆమెపై, కుటుంబ సభ్యులపై దాడి చేయడాన్ని ఖండించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన, వీవోఏ తదితర చిరుద్యోగులపై రాజకీయ వేధింపులు తీవ్రమయ్యాయన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రజాస్వామ్యం, చట్టం గురించి మాట్లాడిన పెద్దలు అధికారంలోకి వచ్చిన తర్వాత అవి వారికి కనిపించడం లేదని అన్నారు. రాజీనామాలు చేయమని ఒత్తిడి చేయడం రాజీనామాలు చేయకపోతే దాడులు చేయటాన్ని ప్రజాస్వామిక వాదులు ఖండించాలన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.మల్లేశ్వరి మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలపై అధికార పార్టీ నాయకుల వేదింపులు, దాడులను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. అధికార పార్టీ నాయకుల దాడులపై జిల్లా వ్యాప్తంగా ఉద్యమాన్ని చేయాల్సి వస్తుందని ఆమె హెచ్చరించారు. అనంతరం దాడులపై తహసీల్దారు అఫ్రపున్నీసా బేగంకు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి చిన్నం పుల్లారావు, యూనియన్ నాయకులు, వివిధ గ్రామాల అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్స్ పాల్గొన్నారు.

డాక్టర్ల నియామకంపై హర్షం

పెదకూరపాడు: మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో డెప్యూటేషన్‌పై డాక్టర్లను నియమించారు. దీనిపై పెదకూరపాడు అభివృద్ధి వేదిక కన్వీనర్ దర్శి శేషారావు మంగళవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. రెండు నెలల పాటు అధికారులు, ప్రజాప్రతినిధులతో చర్చలు జరిపి వైద్యులను నియమించాలని కోరుతూ పలుమార్లు వినతి పత్రాలు అందించామని పేర్కొన్నారు. సత్తెనపల్లి నుంచి తాత్కాలిక ప్రాతిపదికన వారానికి ఒకరోజు డెప్యూటేషన్‌పై డాక్టర్ సుమిత్రను నియమించినట్లు తెలిపారు. జనరల్ సర్జన్‌ను కూడా వేయనున్నారని పేర్కొన్నారు. ఒక నెల రోజుల్లో శాశ్వత ప్రాతిపదికన డాక్టర్లు నియమిస్తామని జిల్లా అధికారులు తెలిపారని పేర్కొన్నారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి రోల్ బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



క్రోసూరు: గుంటూరు బ్రహ్మానందరెడ్డి స్టేడియంలో సోమవారం నిర్వహించిన అంతర్జిల్లాల రోల్ బాల్ గేమ్‌లో స్థానిక సెయింటాన్స్ స్కూల్ విద్యార్థులు ఐదుగురు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్స్‌పల్ సిస్టర్ మేరీ రజిత మంగళవారం తెలిపారు. అండర్ 14 విభాగంలో షేక్ అబుబకర్, కె.అక్షయ ప్రణీత్, అండర్ 17 విభాగంలో ఎస్.జాకీచాన్, యు.ప్రసన్, ఎస్.జాహ్నవి ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు వచ్చే నెల తిరుపతిలో జరిగే రాష్ట్రస్థాయి రోల్ బాల్ పోటీల్లో పాల్గొంటారని వివరించారు. పీడీ మక్కెన వెంకటరావు, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

31 మంది ఉద్యోగాలకు ఎంపిక

క్రోసూరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీ ఎస్ఎస్‌డీసీ) నిరుద్యోగ సమస్యను రూపుమాపడానికి కృషి చేస్తోందని ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల ప్రిన్స్‌పల్ బీవీ రమాదేవీ అన్నారు. మంగళవారం క్రోసూరు పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్ మేళా జరిగింది. సందర్భంగా ఆమె మాట్లాడుతూ మేళాలో 66 మంది హాజరుగా 31 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు చెప్పారు. నియామక పత్రాలు అందుకున్న యువతకు అభినందలు తెలిపారు. మరింత నైపుణ్యాలు పొంది ఉన్నత శిఖరాలు అందుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్కిల్ హబ్ కో–ఆర్డినేటర్ బి.అంజి రెడ్డి, బి.మహీధర్, వైపీ శ్రీనివాస్, కంపెనీ హెచ్ఆర్ ప్రతినిధులు, సీడాప్ పీఓ నాగుల్ పాల్గొన్నారు.

గ్రామాల్లో తారతమ్యం లేకుండా జీవించాలి



రాజుపాలెం: గ్రామాల్లో తారతమ్యాలు లేకుండా కలసి జీవించాలని గుంటూరు సీఐడీ సీఐ శివరామకృష్ణ పేర్కొన్నారు. ఉప్పలపాడు శివారు లక్ష్మీపురం తండాలో ఎస్సీ, ఎస్టీ సంక్షేమ అభివృద్ధి, రక్షణ చట్టాలపై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. సీఐ శివరామకృష్ణ మాట్లాడుతూ దళిత గిరిజనులకు ఉన్న చట్టాలపై అవగాహన కల్పించారు. షెడ్యూల్ కులాలకు, తెగలకు 1989 పీఓఏ చట్టాన్ని వివరించారు. సదస్సులను రాష్ట్ర సీఐడీ, అడిషనల్ డీజీపీ రవిశంకర్ అయ్యన్నార్ ఆదేశాల మేరకు, గుంటూరు సీఐడీ రీజినల్ అధికారి సీహెచ్ ఆదినారాయణ ఉత్తర్వుల ప్రకారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీఐ జి.పూర్ణచంద్రరావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర చైర్మన్ చంద్రునాయక్, డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎస్.రామాంజనేయులు, జై భీమ్ సొసైటీ రాష్ట్ర ప్రసిడెంట్ పిల్లిరాజు, సర్పంచ్ మేరిభాయి, తహసీల్దారు దుర్గేష్ రావు, ఎస్ఐ వేణుగోపాల్ పాల్గొన్నారు.

ప్రమాదకర వ్యాధులకు దోమలు కారణం

సత్తెనపల్లి: దోమలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మలేరియా విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ జి.వీర్రాజు సూచించారు. కీటక జనిత సర్వేలో భాగంగా మంగళవారం పట్టణంలోని వెంగళరెడ్డి నగర్‌లో ఆయన పర్యటించారు. స్థానిక వైద్య సిబ్బందితో ఇంటింటికీ తిరిగి నీటి నిల్వలను పరిశీలించారు. స్థానికులకు అవగాహన కల్పించారు. సర్వేలో అర్బన్ సబ్ యూనిట్ అధికారి చంద్రశేఖర్, రీజినల్ కార్యాలయ సబ్ యూనిట్ అధికారి బి.సుధాకర్, హెల్త్ సూపర్ వైజర్లు రోశయ్య, మల్లేశ్వరరావు, కిరణ్, హెల్త్ అసిస్టెంట్లు షరీఫ్, హుస్సేన్ పాల్గొన్నారు.

నేడు దేవాలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన

బెల్లంకొండ: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కేతవరం వజ్ర లక్ష్మీనారసింహ స్వామి దేవాలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మండల దేవదాయ శాఖ ఈవో అవుడూరి వెంకటేశ్వరరెడ్డి మంగళవారం తెలిపారు. బుధవారం ఉదయం పూజా కార్యక్రమాల అనంతరం 9.39 గంటలకు శంకుస్థాపన జరుగుతుందని పేర్కొన్నారు. మండలంలోని భక్తులు పాల్గొనాలని తెలిపారు.

పోలింగ్ కేంద్రం పరిశీలించిన తహసీల్దార్

ముప్పాళ్ళ: గుంటూరు–కృష్ణా జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దార్ ఎం.భవానిశంకర్ మంగళవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలో అవసరమైన వసతులు, ఏర్పాట్లపైన చర్చించారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులకు రుచిగా, శుచిగా ఆహారాన్ని అందించాలని నిర్వాహకులకు సూచించారు. డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్‌లక్ష్మీ ప్రసాదు, ఆర్.ఐ పి.ఆంజనేయులు, వీఆర్వో రస్కిన్ ఉన్నారు.